నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
బుధవారం
02 అక్టోబరు
2024
పేజీలు 8
గుంటూరు
పల్నాడు

పసిడి వన్నెల పసుపుకి పసుపు బోర్డు' ఊతమిచ్చేనా..!!

# దుగ్గిరాల యార్డ్ పసుపుకు భలే గిరాకీ



- లంక గ్రామాల్లో సిరులు చిందిస్తున్న పసుపు
- సుగంధ ద్రవ్యాల్లో రారాజుగా గుర్తింపు
- విదేశాలకు ఎగుమతి అవుతున్న లంక గ్రామాల పసుపు

**సుగంధ ద్రవ్యాల పంటలను పండించడంలో భారతదేశం.ప్రాచీనకాలం నుంచీ ఎంతో ప్రసిద్ధిగాంచింది సుగంధ ద్రవ్యాల సాగు, ఉత్పత్తికి. దేశ సంస్కృతిలో పసుపు పంట ప్రత్యేక స్థానం. పొందింది ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కృష్ణా నదీ తీరంలో ఉన్న డెల్టా ప్రాంతంలోని పలు లంక గ్రామాలు ఎన్నో సంవత్స రాల నుండి నాణ్యమైన పసుపు ను పండిస్తూ గుంటూరు జిల్లా అగ్రగామిగా గుర్తింపు పొందింది. పసుపు పంట ప్రాముఖ్యతను గుర్తించి తెనాలి డివిజన్లోని దుగ్గిరాలలో ప్రభుత్వం పసుపు మార్కెట్ యార్డును నెలకొల్పింది. ఈ యార్డుకు తరలివచ్చి పసుపుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి విదేశాలకు కూడా పసుపు ఎగుమతి అవుతుందటంలో అతిశయోక్తి లేదు. రాష్ట్రంలోని పొరుగు జిల్లాల నుంచి కూడా దుగ్గిరాల వచ్చే పసుపు విక్రయించుకుంటున్నారంటే యార్డుకు ఎంతటి ప్రాధాన్యత ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దీంతోసుగంధద్రవ్యాల్లో రా రాజుగా పేరుగాంచిన. పసుపు రైతులకు చేయూత ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ముఖ్యమైన జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు రైతుల సమస్యలకు మేలైన పరిష్కారాలు లభిస్తాయన్న ఆశలు చిగురిస్తున్నాయి.....**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో** ప్రాచీనకాలం నుంచీ భారతదేశం సుగంధ ద్రవ్యాల సాగు, ఉత్పత్తికి ప్రసిద్ధి. దేశ సంస్కృతిలో పసుపుది ప్రత్యేక స్థానం. పసుపు సుగంధద్రవ్యాల్లో అత్యంత ముఖ్యమైన వాణిజ్య పంట. జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు రైతుల సమస్యలకు మేలైన పరిష్కారాలు లభిస్తాయన్న ఆశలు ఈ ప్రాంత రైతుల్లో చిగురిస్తున్నాయి. ప్రపంచంలో అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారు, వినియోగదారు, ఎగుమతిదారు మన దేశమే. ప్రపంచ పసుపు వాణిజ్యంలో భారత్ వాటా 60 శాతానికి పైగా ఉంది. మనదేశంలో రైతులు ముప్పై రకాల పసుపును ఇరవై రాష్ట్రాల్లో సాగుచేస్తున్నారు. అందులో గుంటూరు జిల్లాలోని కృష్ణా డెల్టా ప్రాంతంలోని లంక గ్రామాల్లో పండే పసుపు కు మంచి డిమాండ్ ఉంది. ఎక్కువగా మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో పసుపు పండినప్పటికీ లంక గ్రామాల్లో పండే పసుపును ప్రత్యేకంగా కూరలు, ఇతర వైద్యంలో వాడటం అనాదిగా వస్తోంది దేశవ్యాప్తంగా చూసినట్టయితే పసుపు సాగులో మహారాష్ట్ర మొదటి స్థానంలో, తెలంగాణ రెండో స్థానంలో ఉన్నాయి. 2022-23లో 3.24లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగుచేయగా, సుమారు 11.61లక్షల టన్నుల పసుపు దిగుబడి వచ్చింది. ఇందులో సుమారు రూ.1728 కోట్ల విలువైన 1.534 లక్షల టన్నుల పసుపు, అనుబంధ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. ఇందులోనూ లంక ప్రాంతాల్లో పడిన పసుపు ఎగుమతి బాగా జరిగినట్లు తెలుస్తోంది. మన దేశంలో నాణ్యమైన పసుపు పంట పేరు చెప్పగానే గుర్తుకువచ్చేది- గుంటూరు జిల్లాలోని లంక గ్రామాల రైతులే. ఎన్నో తుఫానులు, ఆటుపోట్లను ఎదుర్కొనిఇక్కడి రైతులు దశాబ్దాల తరబడి విస్తృతస్థాయిలో పసుపును సాగుచేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల, తెనాలి ,వేమూరు నియోజకవర్గాల్లోని పలు, ప్రాంతాల్లోనూ ఈ పంట సాగవుతోంది. 2022-23లో ఈ ప్రాంతంలో దాదాపు 15నుంచి 20వేల ఎకరాల్లో పసుపును సాగు చేయగా,60. వేల టన్నుల దిగుబడి వచ్చింది. రాష్ట్రంలో దీని వినియోగం ఎక్కువగా ఉంటుంది. నాణ్యత ఎక్కువగా ఉండటంతో మిగిలిన దిగుబడి ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళుతోంది. కొంతకాలంగా పసుపు సాగును అనేక సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు దుంపకుళ్లు, చీడపీడల ఉద్ధృతి పట్టిపీడిస్తున్నాయి. సాగు ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. తొమ్మిది నెలలపాటు ఆరుగాలం శ్రమించి సాగుచేసినా దిగుబడులు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. సరైన గిట్టుబాటు ధర లభించక పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 'లక్ష్మీ పంట'గా భావించే పసుపు ధర గత పదేళ్లలో గణనీయంగా తగ్గిపోయింది. చాలాసార్లు పెట్టుబడులైనా తిరిగి రావడంలేదు. పసుపు సుగంధద్రవ్యాల విభాగంలో ఉండటంవల్ల కనీస మద్దతు ధరకు భరోసా దక్కడంలేదు. ఫలితంగా గత పదేళ్లలో దీని సాగు లంక గ్రామాల్లో చాలావరకు తగ్గిపోయింది. మద్దతు ధర లభించకపోవడం పట్ల పసుపు రైతుల్లో ఆగ్రహం గూడుకట్టుకొంది. ఈ విషయమై వారు అనేక రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. దాంతో పసుపు పంటకు మద్దతు ధర, మార్కెటింగ్ వసతి, ఎగుమతి అవకాశాల కోసం ప్రత్యేకంగా జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరమీదకు వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దీనికోసం తెలంగాణలోని నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి 178 మంది రైతులు నామినేషన్లు వేసి దాదాపు లక్ష ఓట్లు సాధించారు! దాంతో పసుపు బోర్డు ఏర్పాటు అంశం ఎంతో ఆసక్తి రేకెత్తించింది. ఇదిలా ఉండగా కేంద్రం రైతుల ప్రయోజనాలు, పరిశోధనలు, గిట్టుబాటు ధర వంటి అంశాలతో పాటు... పసుపు సహా 52 సుగంధ ద్రవ్యాల కోసం 1987లో కొచ్చిలో సుగంధ ద్రవ్యాల బోర్డును ఏర్పాటుచేసింది. అయినప్పటికీ, పసుపు పంటకు తగిన ప్రాధాన్యం దక్కడంలేదని రైతులు వాపోయారు. కాఫీ, తేయాకు, పొగాకు పంటలకు ఉన్నట్లే పసుపు పంటకూ ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తూ వచ్చారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయాలంటూ రైతులు ఏళ్ల తరబడి ఉద్యమించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని ఇటీవల

మిగతా 3లో..

## దుర్గి పిహెచ్‌సిలో వైద్యం దైవాదీనం..!

### మెడికల్ సర్టిఫికెట్లకు అమ్యమ్యాలు అడుగుతున్న ఓ వైద్యుడు..?!




**దుర్గి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన దుర్గి లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు దైవాదీనంగా మారాయి. ఈ వైద్యశాలలో 24 గంటలు పని చేయాల్సి ఉండగా రాత్రి వేళల్లో వైద్య సేవలు అందుబాటులో ఉండవు. కారణం ఏంటంటే 24 గంటలు పని చేయాల్సిన వైద్యులు రాత్రి వేళల్లో మాత్రం విధులకు రావడం లేదు. ఎవరికైనా ప్రాణం మీదికి వచ్చి రాత్రి వేళల్లో ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొస్తే డాక్టర్లు లేరని అక్కడ ఉండే వాచ్మెన్ బాధితులను వెనక్కి పంపిస్తున్నట్లు తెలిసింది. లంచాలు తీసుకోకుండా ప్రభుత్వ అధికారులు పనిచేయాల్సి ఉండగా నిబంధనలు అతిక్రమించి ఇక్కడ పనిచేసే డాక్టర్ ప్రవర్తిస్తున్నారని దినపత్రిక సూర్య దృష్టికి వచ్చింది. కొన్ని సందర్భాల్లో విద్యార్థులకు అవసరమయ్యే ఫిజికల్, ఫిట్నెస్ సర్టిఫికెట్స్ కోసం వచ్చే యువత నుండి సుమారు వెయ్యి రూపాయల నుండి రూ.2 వేలు వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మహిళల ఉద్యోగుల బిల్లులు, ఇతర విషయాల్లో సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దుర్గి ప్రభుత్వ వైద్యశాలలో జరుగుతున్న అక్రమాలపై, అమ్యమ్యాలపై అధికారులు, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపి అక్రమాలకు పాల్పడుతున్న వైద్యుడు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## కొత్త మద్యం దుకాణాలకు నోటిఫికేషన్..



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో :** ఏపీలో కొత్త మద్యం షాపుల దరఖాస్తుకు నోటిఫికేషన్ విడుదలైంది. కొత్త మద్యం దుకాణాల కోసం ఒకటవ తేదీ నుంచి ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 11న 3396 మద్యం దుకాణాలకు లాటరీ తీయనున్నారు. రెండేళ్ల కాలపరిమితితో అక్టోబర్ 12 నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానుంది. కాగా, గీత కులాలకు రిజర్వ్ చేసిన మరో 340 షాపులకు విడిగా నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ప్రీమియం బ్రాండ్లు విక్రయించేందుకు ఏర్పాటు చేయనున్న 12 ఎలైట్ షాపులకు కూడా విడిగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఒకే వ్యక్తి ఎన్ని అప్లికేషన్లు అయినా పెట్టుకోవచ్చు. ఈ నెల 11న 3396 షాపులకు లాటరీ తీస్తారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్స్ ఫీజులు రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షలు వరకు నిర్ణయించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల విధానం గడువు సోమవారంతో ముగిసింది. కొత్త విధానం అమల్లోకి వచ్చే వరకూ ప్రస్తుతం ఉన్న దుకాణాలను కొనసాగిస్తామని ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేశారు.

## కోకో కోలా సంస్థ ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్లో పరిసరాల పరిశుభ్రత



**మంగళగిరి మేజర్ న్యూస్:** సామాజిక సేవ కార్యక్రమాలలో భాగంగా మంగళగిరి మండలం ఆత్మకూరు కోకోకోలా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణ, పరిసరాల్లో శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది పిచ్చి మొక్కలు, ముళ్ళ కంపను తొలగించారు. చెత్త ను తొలగించి శుభ్ర పరిచారు. మంగళగిరి రూరల్ సీఐ వై శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా సంస్థ వారు స్వచ్ఛంద సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కోకోకోల సంస్థ ప్రతినిధులు శివారెడ్డి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణలో దసరా ఉత్సవాలు



**మంగళగిరి మేజర్ న్యూస్:** మంగళగిరి టిప్పర్ల బజార్ నారాయణ పాఠశాలలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు నవదుర్గ అవతారాలతో విచ్చేసి అందర్నీ అకట్టుకున్నారు. పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాదేవి పూజ బతుకమ్మ ఆట అందర్నీ అలరించాయి, కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ ప్రసన్నాంజనేయులు విద్యార్థులకు చక్కగా వివరించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏజీఎం బి. రమేష్ రెడ్డి,క్లస్టర్ ప్రిన్సిపల్ సతీష్, హై స్కూల్ కోఆర్డినేటర్ బి. ముత్తారెడ్డి, ఛాంప్స్ కోఆర్డినేటర్ బి. మేరీ శ్రావణి. ఈ కిడ్స్ కోఆర్డినేటర్ కనకదుర్గ.ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్పందించిన హృదయాలు



**మంగళగిరి మేజర్ న్యూస్:** విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసి పలువురు విరాళాలు అందజేశారు. తాడిపత్రికి చెందిన రోటరీ క్లబ్ ప్రతినిధులు రూ. 1,10,000 విరాళం అందజేశారు. పల్నాడు జిల్లా అర్చకసేవా సంఘం ప్రతినిధి జి.కృష్ణమాచార్యులు రూ.లక్ష అందజేశారు. వేములపల్లి శివరామకృష్ణ రూ.50వేల విరాళం అందజేశారు. గుంటూరుకు చెందిన ఆర్.రవి కుమార్ రూ.50వేల విరాళం అందజేశారు. కదిరికి చెందిన ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రతినిధి కే.శ్రీనివాసులు రూ. 20వేల విరాళం అందించారు. కన్నెగంటి నవ్యత రూ.8వేల విరాళం అందించారు వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన దాతలకు మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం



**పెదకాకాని మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని పొన్నూరు నియోజకవర్గ సమన్వయ కర్త మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారము పెదకాకాని గ్రామములో సదాశివనగర్ లో పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన్నవ మాట్లాడుతూ చంద్రబాబు మాటిచ్చినట్లుగానే తొలి నెల నుంచే పించన్లు పెంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఇచ్చే పెన్షన్ తెదేపా హయాంలోనే పెంచింది ఎక్కువని అన్నారు. పేదలను ఆదుకోవడమే చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. చంద్రబాబు నాయుడు యన్.టి.ఆర్. స్ఫూర్తితో పేద జీవితాలు మార్చటమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. 2014 వరకు రూ.200 మాత్రమే ఉండేది. తెదేపా అధికారంలోకి రాగానే రూ.1000 పెంచి, తరువాత రూ.2000 చేయటమైనదన్నారు. ఇప్పుడు 3 వేల రూపాయలు ఉన్న దాన్ని 4 వేల రూపాయలు పెంచటమైనదన్నారు. మొత్తం 4 వేల రూపాయల పెన్షన్ లో 2875 రూపాయలను ఒక్క తెలుగుదేశం పార్టీనే పెంచిందన్నారు. పెదకాకాని మండల పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి చారిత్రాత్మక విజయాన్ని అందించిన ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమములో గ్రామ పార్టీ అధ్యక్షులు కుక్కల మల్లిఖార్జునరావు, సీనియర్ పార్టీ నాయకులు క్రోసూరి పూర్ణచంద్రరావు, పాగోలు శివనాగగోపి, పాగోలు రాము పాల్గొన్నారు

# మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్‌లో ప్రజల విన్నపాలు



**తాడేపల్లి మేజర్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా సాగుతున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 38వ రోజు మంగళవారం ప్రజాదర్బార్ కు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే బారులు తీరారు. ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్ ను స్వయంగా కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయా సమస్యల పరిష్కారంపై అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

**గ్రామస్థుల వద్ద రూ.3 కోట్ల అప్పుచేసి పరారయ్యాడు.**

గ్రామస్థుల నుంచి రూ.3 కోట్ల వరకు అప్పుగా తీసుకుని పరారైన గొరిజాల శ్రీనివాసరావును అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని పెదవడ్లపూడికి చెందిన మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలో అనేక మంది వద్ద అప్పులు చేసిన శ్రీనివాసరావు వాటిని చెల్లించకుండా తప్పించుకునేందుకు పెదవడ్లపూడిని వదిలి కుటుంబంతో సహా గుంటూరుకు మకాం మార్చారని, ఇప్పుడు బెంగుళూరు పరారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి తగిన విధంగా న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. పక్షవాతంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన అక్కల శివశంకరరావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల సంభవించిన వరదలకు తమ ఇళ్లల్లోకి నీరు చేరి సామాగ్రి పూర్తిగా పాడైపోయాయని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మహానాడు ప్రాంత వాసులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందలేదని, విచారించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి నష్టపరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రోజువారీ కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్న తాను ఇటీవల అనారోగ్యం బారిన పడ్డానని, భర్త కూడా లేని తనకు వితంతు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఆత్మకూరు వడ్డెరపాలెంకు చెందిన వేముల సీతమ్మ కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పుట్టుకతో దివ్యాంగురాలినైన తాను ఇంటర్ వరకు చదువుకున్నానని, ఇటీవల తన తల్లిదండ్రుల ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ జీవనం భారంగా మారిందని ఆత్మకూరుకు చెందిన తమ్మిశెట్టి రాధాకీర్తి కన్నీటిపర్యంతమయ్యారు. ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పిస్తే.. కుటుంబానికి అండగా ఉంటానని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. లారీ డ్రైవర్ గా జీవనం సాగించే తనకు రోడ్డు ప్రమాదం కారణంగా రెండు కాళ్లు కోల్పోయానని, ఎలాంటి బీమా పరిహారం అందలేదని మంగళగిరికి చెందిన సమ్మంగి బాలాజీ కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం కుటుంబపోషణ భారంగా మారిందని, ఆర్థిసాయం అందించడంతో ఉపాధి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# ప్రపంచం గర్వించదగ్గ తత్వవేత్త సచ్చిదానందమూర్తి..



**గుంటూరు, మేజర్ న్యూస్:** ప్రపంచం గర్వించదగిన తత్వవేత్తగా ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి ఎనలేని ఖ్యాతి గడించారని మాజీ రాజ్యసభ సభ్యులు, విశ్వ హిందీ పరిషత్ నేషనల్ ప్రెసిడెంట్ వై.లక్ష్మీప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్‌టీఆర్ విజ్ఞాన్ లైబ్రరీ, స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా ముగించారు. ఈ సందర్భంగా సచ్చిదానంద మూర్తి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆయనపై ప్రత్యేకంగా రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యులు, విశ్వ హిందీ పరిషత్ నేషనల్ ప్రెసిడెంట్ వై.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తత్వశాస్త్రం, వేదాంత శాస్త్రం వేరువేరని చెప్పినది మూర్తేనని తెలియజేసారు. ఆయన 14వ ఏటనే రచనలు రచించిన మేధావని కొనియాడారు. విద్యార్థులందరూ తెలుగు భాషను అమ్మ భాషగా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

## శివాలయంలో శాస్త్రోక్తముగా ముగిసిన పవిత్ర ఉత్సవములు



**పెదకాకాని మేజర్ న్యూస్:** శ్రీ మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో పవిత్రోత్సవములలో భాగముగా చివరి రోజు మంగళవారము ఉదయం గం. 6.00ల నుండి విశేష సంధి, ద్వితీయ కాలయాగశాల పూజ, అవభృదయాగం, చతుర్వేదపారాయణలు, మహాపూర్ణాహుతి, యాత్రాదానం, కళశాభిషేకం, అలంకారం, ఉదయం గం. 10.00 నుండి పరివార దేవతా పవిత్ర సమర్పణ శ్రీ గంగా భ్రమరాంభ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారికి విశేష వ్రత చరితపూజ, శైవాగమ పద్ధతిన పవిత్ర సమర్పణ క్రతువును ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చక పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, ఉపప్రధాన అర్చకులు చదలవాడ జాలయ్య, పేటేటి ధనమహేశ్వరప్రసాదు, అర్చకస్వాములు, వేదపండితులు నిర్వహించినారు. శ్రీ స్వామి వారి మూల మంత్ర తత్వార్పన, మంత్రపుష్పం, హారతి, విభూతి, కుంకుమ ప్రసాద వితరణతో పవిత్రోత్సవములు ముగిశాయని ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. పవిత్రోత్సవముల నిర్వహణ దాతలైన రెడ్డినవీన్‌కుమార్ విజయలక్ష్మీ, నీలివెల్లి కోటేశ్వరి మరియు కుటుంబ సభ్యులకు దేవస్థాన అర్చకస్వాములు, వేదపండితులు వేదఆశీర్వచనము చేసినారు. ఆలయ ఉపకమీషనరు శ్రీ స్వామి వారి శేష వస్త్రముతో దాతలను సత్కరించి ప్రసాదములు అందజేసినారు కార్యక్రమము నందు గ్రామస్తులు, భక్తులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్‌కు నైపుణ్యాలు అవసరం



**పెదకాకాని మేజర్ న్యూస్ :** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో మంగళవారం గెస్ట్ టాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ ఏ. చంద్రమోహన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ స్వరూప రాణి పాల్గొని మాట్లాడుతూ ఇటువంటి కోర్సులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఆవశ్యకతను తెలియజేశారు. రోగులతోనూ, ఇతర నిపుణులతోనూ సంభాషించడానికి చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్ విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. డిపార్ట్మెంట్ అధ్యాపకుల యొక్క సమిష్టి కృషిని అభినందించారు.

## మహిళల వడ్డీ వ్యాపారాలు ప్రాణాలతో చెలగాటాలు

### పట్టించుకోని అధికారులు



**తెనాలి క్రైమ్ మేజర్ న్యూస్ :** గతంలోవడ్డీ వ్యాపారాలు చేయా లంటే కొన్ని అనుమతులు షరతుల తో కూడిన వడ్డీ వ్యాపారాలు చేసేవారు. కానీ నేడు చమట పట్టకుండా సులువుగా లక్షలు సంపాదించాలంటే వడ్డీ వ్యాపారమే నయమని కొందరుమహిళలు ఎన్నుకున్నారు. ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొంటున్న పేద, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు, కుటుంబ ఖర్చుల నిమిత్తమై, పిల్లల చదువుల కోసం కానీ,అనారోగ్య పరిస్థితుల్లో కానీ, వడ్డీకి చేయి చాచటం పేదలకు తప్పడంలేదని, ప్రజలు అంటున్నారు. రూరల్ మండలం పరిధిలోని అంగలకుదురు,నందివెలుగు, పెదరావూరు, మరీ ముఖ్యంగా తెనాలి మండలంలోని మేజర్ గ్రామమైన కొలకలూరు దళితవాడ బీసీ కాలనీ ప్రాంతాలలో ఏకంగా మహిళలే వడ్డీ వ్యాపారం చేస్తున్నారని,అందుకు వారికి తోడుగా కొంతమంది నేర చరిత్ర గలవారిని అడ్డుపెట్టుకుని, అధికవడ్డీ వ్యాపారాలను కొలకలూరు బీసీ కాలనీలో కొనసాగిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని నేలపాడు గ్రామంలో కూడ ఇద్దరు ఆత్మ హత్య చేసుకున్నారని, ఒక మహిళలే అధిక వడ్డీ వ్యాపారాలు చేస్తూ అమాయక ప్రజల నుండి వడ్డీల రూపంలో రక్తం పీల్చుతున్నారని,వీరికి పోలీసులన్నా భయంలేక, అధికారులంటే లెక్క లేకుండా, అసలు అలాగే ఉంచి వడ్డీ పేరుతో లక్షలు వసూలు చేస్తూ, దోచుకోవటమే ధ్యేయంగా వడ్డీ వ్యాపారాలు సాగిస్తున్నారని ,అంతే కాకుండా తెనాలి పట్టణంలో యడ్ల లింగయ్య కాలనీలో కొన్ని రోజుల క్రితం వడ్డీకి తీసుకున్న మహిళలు సొమ్ము ఇచ్చిన వారిని నమ్మించి సైనెడ్ తో చంపేశారని,ఇలా మహిళలు పట్టణంలోనూ, పల్లెల్లోనూ వడ్డీ వ్యాపారాన్ని అడ్డు పెట్టుకొని ప్రాణాలతో చెలగాట మాడుతుంటే,సంబంధిత పోలీసు శాఖ వారు వడ్డీ వ్యాపారులపై దృష్టి పెట్టి, వారిని మందలించి ,వడ్డీ వ్యాపారాలను నిలిపివేయాలని, మరి ముఖ్యంగా రూరల్ మండల పరిధిలోని కొలకలూరు దళితవాడ బీ.సి.కాలనీ వడ్డీ వ్యాపారంతో రెచ్చిపోతు అనేక మైన నేరాలకు కారకులౌతు నేరస్తులను పోషిస్తున్నారు. ఈ మహిళల క్రియల పట్ల పోలీసు ఉన్నత అధికారులు స్పందించి వీరిపై కఠిన చర్యలుతీసుకోవాలని గ్రామ ప్రజలుసంబంధిత పోలీస్ అధికారులకువిజ్ఞప్తి చేస్తున్నారు.

## రెవెన్యూ మంత్రి ని మర్యాద పూర్వకంగా కలిసిన కత్తెర దంపతులు



**గుంటూరు మేజర్ న్యూస్** రాష్ట్ర రెవెన్యూ స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ ను సచివాల యంలోని ఆయన చాంబర్లో మంగళవారం మధ్యాహ్నం మర్యాద పూర్వకంగా కలసిన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెరహెని క్రిస్టిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ ఈ సందర్భంగా మంత్రివర్యులు అనగాని సత్య ప్రసాద్ గారికి కత్తెర దంపతులు పుష్ప గుచ్ఛాన్ని అందించారు జిల్లా కు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిగాయి అదేవిధంగా కత్తెర దంపతులను మంత్రివర్యులు శాలువాతో సత్కరించారు.

## ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా క్యాలెండర్ విడుదల

పెదకాకాని మేజర్ న్యూస్ : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం రూపొందించిన 2024 -25 వార్షిక క్రీడా క్యాలెండర్ ను మంగళవారం ఉపకులపతి ఆచార్య కే.గంగాధరరావు విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలలో ఈ క్రీడా పోటీలను నిర్వహించుకునే వీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలకు కేటాయించిన ఆయా క్రీడలను షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రీడాసక్తి పెంచేందుకు ఇటువంటి క్రీడా పోటీలను అన్ని కళాశాలలో నిర్వహించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, వ్యాయామ విద్యాశాఖ డైరెక్టర్ ఆచార్య పిపిఎస్ పాల్ కుమార్, వ్యాయామ విద్య కళాశాల యోగ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ డి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి వేషధారణలో విద్యార్థులు

**తెనాలి మేజర్ న్యూస్ :** రాముడు రావణుని పై గెలిచిన సందర్భంమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన తీసుకున్న రోజు అలాగే జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసినీతో తొమ్మిది రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి విజయాన్ని పొందిన సందర్భంగా పది రోజులు ప్రజలంతా సంతోషంగా పండుగ జరుపుకునే పండుగనే దసరా అంటారని ప్రిన్సిపాల్ బి. రాధ అన్నారు. మంగళవారం స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ చైతన్య పాఠశాల నందు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు విద్యార్థులు అమ్మవారి పది అవతారాల వేషధారణతో కనివిందు చేశారు ఈ పండగ యొక్క ముఖ్య ఉద్దేశం చెడుపై మంచి గెలుస్తుందని విజయానికి గుర్తుగా ఈ పండుగను చేసుకోవడం జరుగుతుందని ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు ఈ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశమును నృత్య రూపంలో విద్యార్థులకు కనులకు కట్టినట్లుగా ప్రదర్శించారు. తొలుత అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో కార్యక్రమం ప్రారంభించి, భరతనాట్యంతో అలాగే జానపద నాట్యములతో కార్య క్రమం ప్రారంభించారు. ఎ.జీ.ఎం అంజయ్య, రీజినల్ ఇంచార్జ్ అప్పా జీలు పర్యవేక్షించగా డీన్ మల్లికార్జునరావు ప్రైమరీ ఇంచార్జ్ హాఫిజూన్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రక్తం దానంతో ప్రాణదానం : డాక్టర్ ప్రసన్న




**తెనాలి (మెడికల్) :** రక్తదానం చేస్తే ప్రాణ దానం చేసినట్లేనని డాక్టర్ బ్లడ్ బ్యాంక్ యూనిట్ బి ప్రసన్న అన్నారు. తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి లో జాతీయ స్వచ్ఛంద రక్త దాన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఏటా అక్టోబర్ 1న నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే ప్రోగ్రాం చేపడుతున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి లో పదిమంది రక్తదానం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన తెనాలి టీ బి యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటికే తాను ఆరుసార్లు రక్తదానం చేసినట్లు చెప్పారు. జాతీయ రక్త దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడోసారి రక్తానం చేస్తున్నట్లు వెల్లడించారు. రక్తదానం చేసిన వారికి బ్లడ్ బ్యాంక్ యూనిట్ డాక్టర్ ప్రసన్న ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది బాపనయ్య, రమాదేవి, శ్యామల పాల్గొన్నారు

# రైల్వే ఉద్యోగుల రక్తదానం అభినందనీయం

**గుంటూరు (మెడికల్) :** రైల్వేలో పనిచేస్తున్న వందమంది ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమని డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ తెలిపారు. డివిజనల్ రైల్వే కార్యాలయంలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డి ఆర్ యం రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా రైల్వే ఉద్యోగులు ముందుకు వచ్చి మొదటిసారి రక్తదానం చేయటం ఆనందంగా ఉందన్నారు. పేద రోగులకు వైద్యం అందిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ కు 100 యూనిట్ల రక్తాన్ని అందించడం ద్వారా అత్యవసర వైద్య సేవలకు తోడ్పడుతుందన్నారు. ఇక ముందు కూడా ఏటా జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం రోజున డివిజనల్ రైల్వే కార్యాలయంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. దీని వల్ల ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు బలోపేతం అవుతుందన్నారు . అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు ప్రసవ సమయంలో, తల సేమియా వ్యాధి గ్రస్తులకు, ప్రమాద సందర్భంగా రక్తం అవసరం అవుతుందని, యువత ముందుకు వచ్చి రక్తం కొరతను తీర్చాలని కోరారు. రక్తం దానం చేసిన రైల్వే ఉద్యోగులుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలను తొలగించి ప్రజలను జాగృతులను చేయటం ద్వారా స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు



వస్తారన్నారు. త్రిపుర, తమిళనాడు, పశ్చిమబెంగాల్ లో స్వచ్ఛంద రక్తదాతలు అధికంగా ఉన్నారని అన్నారు. 18 నుండి 60 ఏళ్ల మధ్య వయసు వారు ప్రతి మూడు నెలలుకొకసారి రక్తాన్ని దానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. సురేష్ కుమార్, మానవత చైర్మన్ పావులూరి రమేష్, సీనియర్ డిపిఓ హనూర్, మానవత బ్లడ్ డొనేషన్ కమిటీ చైర్మన్ పి, గురవారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి. సుధాకర్ రావు, మానవత డైరెక్టర్స్ నల్లబోతు సాంబశివరావు, డాక్టర్ కల్పన, రమణ, డాక్టర్ సంగమేశ్వరరావు లు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ పేటలో వైద్య శిబిరం




**గుంటూరు మెడికల్:** పాత గుంటూరు క్రిస్టియన్ పేటలో ఉన్న కింగ్ డమ్ చర్చి నందు హోప్ విన్ హాస్పిటల్స్ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితిల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోప్ హాస్పిటల్స్ చైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఉమెన్స్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమ సుల్తాన వైద్య శిబిరానికి వచ్చిన పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం పేషెంట్లకు అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సందర్భం ఏదైనా నేడు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలన్న లక్ష్యంతో హోప్ విన్ హాస్పిటల్స్ 10 రూపాయలకే ఓపిని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి పేషెంట్ సద్వినియోగం చేసుకొని హోప్ విన్ హాస్పిటల్స్ లో ఉన్న అన్ని రకాల వైద్య సేవలను అతి తక్కువ ఖర్చుతో పొందాలని ఆమె సూచించారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, అన్ని రకాల హెల్త్ ఇన్సూరెన్స్ లు తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్ని లక్షలు సంపాదించామన్నది కాదు.. మన ఆరోగ్యాన్ని ఏ మేరకు కాపాడుకున్నామన్నదే ముఖ్యమని భావించాల్సి ఉంటుందన్నారు. కింగ్ డమ్ చర్చి పాస్టర్ రెవరెండ్ డిఎస్ సీ ఫిన్నీ మాట్లాడుతూ హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తాన కింగ్ డమ్ చర్చి నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓపిఎస్ సాధనే యూటీఎఫ్ లక్ష్యం



**తుళ్లూరు మేజర్ న్యూస్..** ఓపిఎస్ సాధనే యూటీఎఫ్ లక్ష్యమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పునరుద్ఘాటించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించు కుని స్థానిక బాపూజీ పాఠశాలలో మంగళ వారం పి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మహాసభ జరిగింది.సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ,రాష్ట్రంలో 3 లక్షల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు సిపిఎస్ పరిధిలో ఉన్నారని,సిపిఎస్ ను రద్దు చేస్తామన్న వైసిపి ప్రభుత్వం హామీ విస్మరించి జిపిఎస్ అనే నూతన విధానాన్ని తీసుకు వచ్చిందని అన్నారు.సిపిఎస్, జిపిఎస్ కు తాము వ్యతిరేకమని,ఓపిఎస్ ను పునరుద్ధరించాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ఓపిఎస్ అంశం జాతీయ స్థాయిలో చర్చనీయాంశ మైందని,కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఓపిఎస్ ను అమలుచేస్తామని ప్రకటించిందని చెప్పారు.వైసిపి ప్రభుత్వం 117 జీవో తీసుకువచ్చి పాఠశాలలను నిర్వీర్యం చేసిందని,ప్రాథమిక పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు.పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ బాబు తాము అధికారంలోకి వస్తే 117 జీవో రద్దు చేస్తామని చెప్పడంతో ఆయనను కలిసి విన్నవించడం జరిగిందన్నారు.విద్యారంగానికి శాపంగా మారిన 117 జీవో రద్దు,3,4,5 తరగతుల తరలింపు,తెలుగు,ఇంగ్లీష్ మీడియం అంశాలపై ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పడం జరిగిందని వివరించారు.వెయ్యి పాఠశాలల్లో పదవ తరగతిలో సిబిఎస్ఈ సిలబస్ ను స్టేట్ బోర్డు పరిధిలోకి తీసుకు రావడం అభినందనీయమన్నారు.12 వ వేతన సంఘం ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించాలని లక్ష్మణరావు కోరారు.విద్యారంగ పరిరక్షణకు జరిగే ఉద్యమాలలో మహిళా ఉపాధ్యాయులు ఎక్కువమంది పాల్గొనాలని కోరారు.ఉద్యమాలకు ప్రజా మద్దతు చాలా ముఖ్యమని,ప్రజల సహకారం లేకుండా ఏ ఒక్క ఉద్యమం కూడా విజయవంతం కాదని అన్నారు. యూటీఎస్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఉపాధ్యాయులలో క్రీడా స్ఫూర్తిని కలిగించాలన్న సంకల్పంతో అక్టోబర్ 4,5,6 తేదీలలో గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు వి రాజశేఖరరావు, టి ఆంజనేయులు, సిహెచ్ ఆదినారాయణ, అడివి శ్రీనివాసరావు, ఎం కోటిరెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి టి భాస్కరరావు, సీనియర్ నాయకులు కె రాజయ్య, మండల నాయకులు ఎ కోటేశ్వరరావు, వి ప్రసాద్, టి పూర్ణచంద్రరావు, పి వాణి, ఎం అశోక్, కె కొండయ్య పాల్గొన్నారు.

## దుగ్గిరాల యార్డ్ పసుపుకు భలే గిరాకీ

(మొదటిపేజీ తరువాయి)

పాలమూరు సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. తదనుగుణంగా కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేయడంతో కేంద్ర వాణిజ్య పరిశ్రమలశాఖ తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో పసుపు రైతుల దశాబ్దాల కల నెరవేరినట్లయింది. పసుపు, అనుబంధ ఉత్పత్తులపై అవగాహనను, వినియోగాన్ని పెంచడం... మార్కెటింగ్, రవాణా, ఎగుమతి అవకాశాలను వృద్ధి చేయడంతోపాటు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించేం దుకు జాతీయ పసుపు బోర్డు ఇతోధికంగా తోడ్పడుతుంది. అంతర్జాతీయ స్థాయి నాణ్యత, ఆహార భద్రత ప్రమాణాలతో కూడిన పసుపు ఉత్పత్తులను తయారు చేసేందుకూ దోహదపడుతుంది. రైతులు, ఉత్పత్తిదారుల్లో నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యం పెంపుదలకు ఈ బోర్డు ప్రత్యేకంగా దృష్టి సారించనుంది.

**పటిష్ఠ ప్రణాళికలతోనే...** భారత్ నుంచి పసుపు ఎగుమతులు 2030 నాటికి సుమారు రూ.8330 కోట్లకు చేరతాయని అంచనా. పసుపు రైతులు ఏళ్ల తరబడి ఒకే రకమైన విత్తనాలను సాగు చేస్తున్నారు. దుంపకుళ్లు, చీడపీడలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని... నాణ్యమైన కర్క్యుమిన్ కలిగి, అధిక దిగుబడులను ఇచ్చే కొత్త వంగడాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరం. ఇటువంటి విత్తులను తక్కువ ధరకే పసుపు రైతులకు అందించాలి. ఆ దిశగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలను సమన్వయపరచాలి. వాటి సాయంతో వినూత్న పరిశోధన-అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలి. పసుపు దుంపలను తవ్వడం, ఉడకబెట్టడం, ఆరబెట్టడం, కొమ్ములను వేరుచేయడం వంటి ప్రక్రియల్లో ఆధునిక పద్ధతులపై రైతులకు శిక్షణ ఇవ్వాలి. ఒడిశాలోని కందమాల్, తమిళనాడులోని ఈరోడ్, మహారాష్ట్రలోని సాంగ్లీ రకాలకు భౌగోళికపరమైన గుర్తింపు ఉంది. ఇటువంటి ప్రత్యేక రకాల సాగు పట్ల దృష్టి సారించాలి. పసుపు పంట సమగ్రాభివృద్ధికి, రైతుల శ్రేయస్సుకు పటిష్ఠ ప్రణాళికలను రూపొందించి, చిత్తశుద్ధితో అమలు చేయాలి. అప్పుడే- పసుపు సాగు సిరులు కురిపిస్తుంది. ఆ దిశగా జాతీయ పసుపు బోర్డు ముందడుగు వేయాలని ఆశిద్దాం.

**ప్రపంచవ్యాప్త గిరాకీ...** పసుపు దుంపల్లో 'కర్క్యుమిన్' అనే పదార్థం ఉండటంవల్లే అవి బంగారు వర్ణంలో ఉంటాయి. అంతర్జాతీయ విపణిలో అత్యంత గిరాకీ కలిగిన ఈ తరహా పసుపు తెలంగాణలో ఉత్పత్తి అవుతుంది. దీన్ని సాగుచేస్తే బంగారం పండించినట్లేనని గతంలో రైతులు గొప్పగా చెప్పుకొనేవారు. అందుకు తగ్గట్లే 2011లో తులం బంగారం రూ.16, 000 ఉండగా, క్వింటాలు పసుపు కూడా అంతే ధర పలికింది! పసుపు సాగు చేయడానికి ఎకరానికి సుమారు 75 వేల రూపాయల వరకు ఖర్చవుతోంది. సుమారు పదహారు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. బాగా పండితే దిగుబడి పాతిక క్వింటాళ్ల వరకు ఉంటుంది.

## మద్యం నోటిఫికేషన్ త్వరలో విడుదల జిల్లా కలెక్టర్



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** మద్యం నోటిఫికేషన్ త్వరలో ప్రభుత్వం విడుదల చేయ నుందని, మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కట్టుదిట్ట ంగా, భద్రతా చర్యలు పాటిస్తూ, పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. మద్యం దుకాణాల పాలసీపై జిల్లా కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024 సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించుటకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వబోతున్నదని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలో 129మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించ బోతున్నామన్నారు. దరఖాస్తుదారులు మద్యం దుకాణాలకు సంబంధించిన ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దరఖాస్తులు చేసుకోవచ్చునని అన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ లాటరీ నిర్వహించు విధానాన్ని కలెక్టర్‌కి వివరించారు. మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కట్టుదిట్టంగా, భద్రతా చర్యలు పాటిస్తూ, పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వక అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ఆహ్లాదంగా కృష్ణవేణి డిగ్రీ కాలేజ్ ప్రెషర్స్ డే వేడుకలు..





**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల గ్రౌండ్ ఆవరణంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా బాటలు వేయాలని సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో విడుదల చేసిన డిగ్రీ ఫలితాలలో విద్య, క్రీడలలో ప్రతిభ చూపించి పతకాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా సినీ యాంకర్‌లు విచ్చేసి కళాశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆనందించారు. వేడుకల్లో కళాశాల డైరెక్టర్ నాసరయ్య, వీర రామరాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

## 75త్యాళ్లూరులో వైభవంగా దసరా మహోత్సవాలు



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** పెదకూరపాడు మండలం, 75త్యాళ్ళూరు గ్రామంలో వేంచేసి యఋన్నశ్రీకాశీఅన్నపూర్ణాంబికా విశ్వేశ్వర స్వామి వారి దేవాలయంలో దసరా మహోత్సవాలు అక్టోబర్ 3వ తేదీ గురువారం నుండి 12వ తేది శనివారం వరకు ఘనంగా జరుగనున్నాయని శ్రీశివసాయి ట్రస్టు సభ్యులు తెలిపారు. అమ్మవారికి రోజుకో అలంకారంతో నవరాత్రులలో ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుండి 9గంటల వరకు శ్రీలలిత సహస్ర నామాలతో ఖడ్గమాల, శ్రీసూక్త, దుర్గా సూక్తాలతో కుంకుమార్చన జరుగు తుందని, ప్రత్యేకంగా 12వ తేది శనివారం సాయంత్రం విజయదశమి రోజు ఆలయం ప్రక్కనే ఉన్న చెరువులో అమ్మవారికి తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 13వ తేది రాత్రికి అమ్మవారికి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. మహిళలు, బాలికలు అధికసంఖ్యలో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని శ్రీదుర్గామాత ఆశీస్సులు పొందాలని కోరారు. విచ్చేసిన భక్తులకు పూజానంతరం ఆశీర్వచనం, తీర్థ ప్రసాద పంపిణీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## కిడ్నీ బాధితురాలికి చేయూత : ఎస్ఐ సంధ్యారాణి



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** స్థానిక సత్తెనపల్లి పట్టణంలో వెంగళరెడ్డి నగర్ 11వ వార్డులో నివ సిస్తున్న సౌపాటి దుర్గమ్మ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకొని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మీడియా ఆర్గనైజేషన్ ద్వారా ఒక నెలకు సరిపడ నిత్యావసర వస్తువులను పట్టణ ఎస్సై సంధ్యారాణి చేతుల మీదగా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మీడియా ఆర్గనైజేషన్ నేషనల్ లీగల్ అడ్వైజర్ కోటగిరి లక్ష్మణ్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి గోపి, రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు అంచుల ఖాళీ దుర్గ, పల్నాడు జిల్లా అధ్యక్షుడు లంకెమల్ల రాంబాబు, షేక్ సైదా వలి, గర్నెపూడి చిన్న తదితరులు ఉన్నారు.

# ప్రసాదంలో జరిగిన అపచారానికి నిరసన ర్యాలీ..



- వేలాదిగా తరలివచ్చిన హిందూవులు, మహిళలు, వెంకటేశ్వర స్వామి భక్తులు
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నరసరావుపేట వీధుల్లో కదం తొక్కిన హిందువులు

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం తయారీలో అపచారానికి నిరసనగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నరసరావుపేట పట్టణంలోని మల్లమ్మ సెంటర్ నుండి ఇస్సపాలెం కాళికా అమ్మవారి దేవస్థానం వరకు జరిగింది. వేలాదిగా హిందూ బంధువులు, వెంకటేశ్వర స్వామి భక్తుల జగన్ వ్యతిరేక నినాదాలతో వీధులన్నీ మారుమోగి పోయాయి. అపచారానికి నిరసనగా అపచారాన్ని ప్రోత్సహించిన జగన్ రెడ్డికి వ్యతిరేకంగా నరసరావుపేట వీధుల్లో హిందువులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో కదం తొక్కారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగన్ ముఖ్యమంత్రిగా పరిపాలన చేసిన కాలంలో తిరుమల ప్రతిష్ట దిగజారిపోయిందని హిందూ దేవాలయాలపై దాడులు పెరిగిపోయాయని డాక్టర్ చదలవాడ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీవారి మీద నమ్మకం ఉందని ఇచ్చే డిక్లరేషన్ ఇవ్వని జగన్మోహన్ రెడ్డికి శ్రీవారి ప్రసాదాల విలువ ఎలా తెలుస్తుందన్నారు. హమంతుని చిరచేదనం, వెండి రదాల దగ్ధం, హిందూ దేవత విగ్రహాల పై దాడి, తిరుమల శ్రీవారి ప్రసాదాల అపవిత్రత వంటి అన్ని తప్పులకు జగన్మోహన్ రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఏడుకొండలను ఆరు కొండలు చేయాలని విర్రవీగి పావురాల గుట్టలో ముక్కలు ముక్కలైన వైయస్ రాజశేఖర్ రెడ్డి కి పట్టిన గతే జగన్మోహన్ రెడ్డికి పడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హెచ్చరించారు. హిందూ దేవతల జోలికి వస్తే ఎంతటి వారినైనా క్షమించబోయేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి వెంకట నరసయ్య, కడియాల వెంకటేశ్వరావు, నాగసారపు సుబ్బారాయగుప్తా, రంగిశెట్టి రామకృష్ణ, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, వైద్యులు, కూటమి నేతలు, కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి - ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ





**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** మండలంలోని పెదమక్కెన గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ హెూదాలో ఉన్న కూటమి రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**అన్నా క్యాంటీన్‌కు రేషన్ డీలర్ల విరాళం :**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాజుపాలెం మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ వారు అభిమానంతో ఒక లక్ష పదహారు రూపాయలు అన్నా క్యాంటీన్ కు శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ చేతుల మీదగా మునిసిపల్ కమిషనర్ కొలిమి షమ్మీకు అందించారు.

**వరద బాధితులకు విద్యార్థుల సాయం :**

పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాలు కుటీర్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జూనియర్ కాలేజ్ వారు వరద బాధితులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి సహాయనిధికి 25వేల రూపాయలు విరాళంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కాలేజీ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం



**వినుకొండ, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో సభ్యులుగా చేరి సమాజ సేవలో భాగస్వాములవ్వాలని, సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బెల్లంకొండ ప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ మాట్లా డుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పునికి పుచ్చు కోవడంలో ఎన్ఎస్ఎస్ ఎంతో తోడ్పడుతుందని విద్యార్థి దశ నుండి సమాజాన్ని చైతన్య పరుస్తూ సమాజంలోని సమస్యలు, రుగ్మతలపై స్పందించే లక్షణాలను అలవర్చు కోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ హరిబాబు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీ జి అంజయ్య ఐ.క్యూ. ఏ. సి. కోఆర్డినేటర్, డాక్టర్ కెవిఎస్ కోటేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు..




**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ ఉక్కు పరిరక్షణకై యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షల్లో భాగంగా మంగళవారం నరసరావుపేట గాంధీ పార్క్ నందు యువజన, విద్యార్థి సంఘాల నాయకులు దీక్షలు చేశారు. ఈ సందర్భంగా యువజన , విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం 1325 రోజులుగా పోరాటం జరుగుతుందని, ఆంధ్రుల ఆత్మగౌరానికి ప్రతీకగా వున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వైఖరిలో ఏమాత్రం మార్పు లేదన్నారు. కేంద్ర స్టీల్ మంత్రిత్వ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు, మంత్రి మాట్లాడుతున్న తీరు, రాజకీయ నాయకుల ప్రకటనలు చూస్తుంటే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పై పెద్ద కుట్ర జరుగుతున్నట్లు కనపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి చేస్తున్న దానికి పొంతన కుదరటం లేదని మండిపడ్డారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడపకపోగా నడుస్తున్న బ్లాస్ట్ ఫర్నెస్ ఆపేసి ఉత్పత్తిని తగ్గించి వేసిందన్నారు. 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 7 మిలియన్ టన్నులకు పరిమితం చేశారన్నారు. పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు అవసరమైన బొగ్గు, ఇనుప ఖనిజం స్టీల్ మంత్రి ఆధ్వర్యంలో ఉన్న ఎన్ఎండిసి సెయిల్ వద్ద పుష్కలంగా ఉన్నాయనీ రాష్ట్రం నుంచి స్టీల్ సహాయ మంత్రిగా శ్రీనివాస్ వర్మ ఉన్నారని తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నడిపేందుకు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్ విలీనం చేసేందుకు ఒక పైసా కూడా ఖర్చు చెనక్కర్లేదు అని అయినా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా అన్యాయంగా 4000 మంది కార్మికులను తొలగించటం అలాగే ఫిట్నెస్ పేర ఇంకొంత మందిని అలాగే సీనియర్ ఇంజనీర్లను డిపుటేషన్ పేర పంపిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్టీల్ ప్లాంట్ పై కుట్రలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, కార్మిక సంఘాల నాయకులు శిలార్, శివ కుమారి, మల్లీశ్వరి, ఆంజనేయులు నాయక్, కాస రాంబాబు, రంగయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన, విద్యార్థి సంఘాల నాయకులు ఆంజనేయ రాజు, రాజ్ కుమార్, సాయి కుమార్, అమూల్య, శ్రీనివాస్, శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా.. మన్నించు..!



- ఎన్నో ఏళ్లుగా ఆదరణ కరువు
- పగుళ్లు వచ్చి శిథిలావస్థకు చేరిక
- కనీసం రంగులకూ నోచని వైనం

**రెంటచింతల, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించిన ప్రజా ప్రతి నిధులు, అధికారులు, వివిధ స్వచ్ఛంద సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు 75 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని ఆనందంగా జరుపుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ నాడు ప్రతి ఇంటి పై జాతీయ జెండాలను ఎగురవేసి, ర్యాలీలు నిర్వహించటం వంటి కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. అయితే దేశ స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన జాతిపిత విగ్రహాలను ఎవరు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తు న్నాయి. జాతీయ పండుగ కార్యక్రమాలకు హడావిడి చేసే అధికారులు దేశానికి స్వాతంత్ర్యం రావడానికి పోరాటం చేసిన గాంధీజీని మరిచారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట ఉన్న గాంధీజీ విగ్రహం ఎన్నో ఏళ్లుగా నిరాదరణకు గురై శిథిలావస్థకు చేరుకుంది. గాంధీ విగ్రహానికి ఇప్పటివరకు ఏ ఒక్కరూ పూలమాల వేయలేదు. శిథిలావస్థకు చేరుకుంటున్న ఆ విగ్రహం వైపు కన్నెత్తి చూసేవారు కూడా లేరు. విరిగిన చేయి, చేతి కర్ర, పెచ్చులూడిన కాలుతో గల గాంధీ విగ్రహానికి పాటు దిమ్మెకు సైతం పెచ్చు లూడాయి. కనీసం వజ్రోత్సవాల సందర్భంగా అయినా విగ్రహానికి మరమ్మత్తులు చేసి, రంగులు వేస్తారని ఆశించినా ఎవరూ దాని వైపు చూసిన పాపాన పోలేదు. గాంధీ జయంతి, వర్ధంతికి విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న అధికారులు రోడ్డు పక్కన ఉన్న ఈ విగ్రహాన్ని పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. తరతరాలకు స్ఫూర్తి ప్రదాత అయిన గాంధీజీని గౌరవించేలా ఇప్పటికైనా మరమ్మత్తులు చేయించి జాతిపితకు ఘనమైన నివాళిగా అధికారులు, ప్రజా ప్రతినిధులు తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు

## కొండవీడు ఈఎన్‌టి హాస్పిటల్ ఉచిత మెగా వైద్య శిబిరం..



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నరసరావుపేటలోని కొండవీడు ఈఎన్టీ హాస్పిటల్ నందు ఉచిత మెగా వైద్య శిబిరా న్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగ ళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 24 సంవత్సరాల నుండి జాతీయ ప పార్వదినాలైన ఆగష్టు 15, జనవరి 26,అక్టోబర్ 2వ తేదీలలో ఉచిత మెగా వైద్యశిబిరాలను నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిచి మందులను పంపిణ్ణి చేయట ంతో పాటు అవసరమైన రోగులకు చెవి, ముక్కు, గొంతు సర్జరీలు చేస్తున్నామని చెప్పారు. ఈ రోజు ఉదయం 9 గంటల వద్దనుండి మధ్యాహ్నం 2 వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. వైద్య శిబిర్యానికి హాజరైనా రోగులకు లాటరీ పద్దతి ద్వారా 10 మందిని ఏంపికచేసి తెల్ల రేషన్ కార్డు లేకపోయినా ఉచితంగా సర్జరీలు చేయటం జరుగు తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కంజుల శ్రీ వర్షిణి, సీఈవో మస్తాన్ రెడ్డి. మేనేజర్ మహేష్, మెడికల్ షాప్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం



**నూజెండ్ల, మేజర్ న్యూస్ :** మండలంలోని వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా కంభంపాడు, పమిడిపాడు రైతు సేవా కేంద్రాలలో రైతులతో మండల వ్యవసాయ అధికారిణి సుగుణా బేగం షేక్ సమావేశం నిర్వహించారు. రైతుల కోసం రాష్ట ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. ఆయా గ్రామాలలో సాగు చేసిన పంటలను పరిశీ లించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయ కులు కోటయ్య, హిమబిందు, పశువైద్య సహాయ కులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మండలంలో మెరిసి.. జిల్లా స్థాయికి ఎదిగి.. రాష్ట్రస్థాయిపై గురి

**- చెకుముకి సైన్స్ ప్రతిభ పోటీల్లో రామకృష్ణ గురుకులం విద్యార్థులు**



**రెంటచింతల, మేజర్ న్యూస్ :** విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని తమ కలలను సహకారం చేసుకునేందుకు అడుగులు వేస్తున్నారు రామకృష్ణ గురుకులం ఉన్నత పాఠశాల విద్యార్థులు. విద్యాసంస్థలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రశంసలు అందుకుంటున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో స్థానిక రామకృష్ణ గురుకులం పాఠశాల విద్యార్థులు రాణించి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చెకుముకి పోటీల్లో రాణించిన విద్యార్థులు కార్తికేయ, తనూజ, షైనీ లను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ ఆత్మకూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పోటీ పరీక్షలతోనే ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెకుముకి లాంటి పోటీ పరీక్షలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కుమారి, శాంతిలతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెల్లవారకముందే పెన్షన్ల పంపిణీ..

- పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- ఆర్థిక ఇబ్బందుల్లోను ఒకటో తారీకు పెన్షన్ల పంపిణీ



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** నరసరావుపేట నియోజకవర్గంలో మంగళవారం తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ జరిగింది. కార్యక్ర మంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని అవ్వా తాత లను పలకరించుకుంటూ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒకటో తారీకున అవ్వా తాతల ఇళ్ళ ముందు తెల్లవారక ముందు పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పెన్షన్ల పంపిణీ లో ఎన్డీఏ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయబోదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్లను మంజూరు చేయడంలో చంద్రబాబు ముందుంటుందని చదలవాడ చెప్పారు.

## చెకుముకి పోటీలలో ఓబులేసునిపల్లె విద్యార్థులకు ప్రథమ స్థానం



**దుర్గి, మేజర్ న్యూస్ :** మండల స్థాయిలో జరిగిన చెకుముకి పోటీలలో దుర్గి మండలంలోని ఓబులేసునిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు జి.భవ్యశ్రీ, సీహెచ్.నవ్య, జి.భూపతి నాగమల్లేశ్వరరావులు ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జొరిగె శ్రీనివాసరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బూసాని కోటేశ్వరరావు, బి.వెంకట అప్పారావు, టి.కనకరాజు, జి.వెంకటాచారి, తల్లిదండ్రులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

## తెల్లవారుజామునే పెన్షన్ పంపిణీ కార్యక్రమం..



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** పట్టణంలోని 9, 16వ వార్డులలో ఉదయం 6గంటల నుండి ఎన్డీయే కూటమి నాయకుల సహకారంతో ప్రతి ఇంటికి వచ్చి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పి పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సోషల్ వెల్ఫేర్ పాపారావు, హెల్త్ అసిస్టెంట్ సైదమ్మ, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## షేక్ మౌలానా అబ్దుల్ కరీంకు నియామక పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే యరపతినేని..



**పిడుగురాళ్ళ, మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల మండల ప్రభుత్వ ఖాజీగా నియమితులైన షేక్ మౌలానా అబ్దుల్ కరీంకు నియామక పత్రాన్ని అంద జేసిన గురజాల నియోజక శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు. ఈ సందర్భ ంగా యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ముస్లింలకు అందుబాటులో ఉంటూ సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ బాబావలి, టిడిపి సీనియర్ నాయకులు భాష, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు షేక్ సైదా, ఫరీద్ మేస్త్రి, జనసేన పార్టీ నాయకులు షేక్ ఖాసిం, సలీం, షేక్ ముజీబ్, సయ్యద్ ఇర్షాద్, పఠాన్ ఖాసింసా, కొట్టు భాష, ఆర్ఎంపీ వలీ, గని, మొహమ్మద్ మౌలానా, తాజ్ ఉద్దీన్, డాక్టర్ సర్దార్, వాచర్ బుడే మేస్త్రి, షేక్ జమాల్, షేక్ సుభాని టీడీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన గురజాల ఎమ్మెల్యే "యరపతినేని"



**పిడుగురాళ్ళ, మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ళ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పంపిణీ చేశారు. పిడుగురాళ్ళ పట్టణంలోని 1వ వార్డు (చంద్రపాలెం), 31వ వార్డు, 32వ వార్డు, 33వ వార్డులకు చెందిన అవ్వ తాతలకు, వితంతువులకు, విభిన్న ప్రతిభావంతులకు ఎమ్మెల్యే యరపతినేని పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ళ మున్సిపల్ కమిషనర్ పర్వతినేని శ్రీధర్, ప్రభుత్వ సిబ్బంది, లబ్ధిదారులు, పిడుగురాళ్ళ పట్టణంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల, వార్డు స్థాయిల్లో వివిధ హెూదాల్లో వున్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ కొమెర వీరాస్వామికి ఘన నివాళి



**మాచర్ల, మేజర్ న్యూస్ :** ఉద్యమ కారుడు కామ్రేడ్ కొమెర వీరాస్వామి వర్ధంతిని స్థానిక సిపిఐ కార్యాలయంలో టౌన్ సెక్రటరీ మిద్దెపోగు బాబు రావు ఆధ్వర్యంలో మంగళ వారం ఘనంగా జరిగింది. ముందుగా వీరాస్వామి చిత్రపటానికి పూల మాలలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ వీరస్వామి నిబద్ధత కలిగిన వ్యక్తి అని,ఆయన చిన్ననాటి నుండే కమ్యూనిస్టు భావాలతో ఉండేవారన్నారు. ఆయన సిపిఐ ఏరియా కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా, ఏఐటియూసి నియోజకవర్గ సెక్రటరీగా సేవలందించారన్నారు. ఆయన చేసిన భూ పోరాటాల ఫలితంగానే పట్టణంలోని చెన్నకేశవ కాలనీ, బండ్ల బజార్, పీడబ్ల్యూడి కాలనీ, పాత రైలు కట్ట,సుద్ధ గుంతల ప్రాంతాలలో సుమారు 300 మందికి ఇళ్ల స్థలాలను ఇప్పించ గలిగారన్నారు. పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీ కార్యాలయం సొంత భవనాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు నడవాలన్నారు. ఈకార్యక్రమంలో బత్తిన వెంకటేశ్వర్లు, నర్రా రంగస్వామి, మంజుల లక్ష్మయ్య, కొణపర్తి బ్రహ్మం, గాజుల చెన్నయ్య, షేక్ మౌలాలి, ఎర్ర శ్రీను, బత్తుల వెంకట స్వామి, తిమ్మరాజు, బత్తిన శ్రీను, ఉప్పుతోళ్ల అంజి,షేక్ జబ్బార్, బత్తుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జనశ్రేణుల ప్రాయశ్చిత్త దీక్ష..



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కోటప్పకొండ రోడ్డులోని శ్రీనివాస కాలనీలో మంగళవారం శ్రీ వెంకటేశ్వరరావు స్వామి గుడిలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత్త దీక్షను జనసైనికులు నిర్వహించారు . ఈ సందర్భంగా ఓం నమో నారాయణ మంత్రాన్ని పూజలో ఉచ్చయించారు. ఈ పూజా కార్యక్రమంలో సయ్యద్ జిలానీ (జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నరసరావుపేట ఇంచార్జి), పట్టణ అధ్యక్షులు జీవీఎస్ ప్రసాదు, ఉపాధ్యక్షులు మేడిశెట్టి రామారావు, అధికార ప్రతినిధి షైక్ ఆర్థుఫ్, తిరుమల శెట్టి శ్రీనివాసరావు, ఆళ్ల శ్రీనివాసరావు, నిమ్మల శ్రీనివాసరావు, తమ్మిశెట్టి కోటేశ్వరావు, బత్తుల చిన్న వెంకటేశ్వరరావు, ధర నాగార్జున, తెల్ల వెంకటేశ్వరరావు, ఆళ్ల శీను, అచ్చుల సాంబశివరావు, కిష్టంశెట్టి ఏడుకొండలు, వనపర్తి విష్ణు, మదిరే కాజా, నక్క గోపి, అప్పిశెట్టి సురేష్, చుండుకూరి శ్రీనివాసరావు, నియోజవర్గం నాయకులు పాల్గొన్నారు.

## లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి : ఏవో

**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** పెదకూరపాడు మండలం లోని బుచ్చయపాలెం, రామాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రత్తిలో గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించటానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్కొక్క లింగాకర్షక బుట్టలో 8రెక్కల పురుగులు వరుసగా 3రోజులు గమనించి నట్లయితే ప్రొఫెనోఫాస్ 400ఎంఎల్ /ఎకరానికి లేదా క్లోరిఫెరిఫాస్ 500ఎంఎల్/ఎకరానికి పిచికారీ చేయవలెనని మండల వ్యవసాయాధికారి ఐ.శాంతి తెలియచేశారు. యానిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్ కుమారి.శ్రీలక్ష్మి పశుసంవర్ధక శాఖలో ఉన్నటువంటి వివిధ పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు శ్రీ బి.రాజు, గ్రామ పెద్దలు క్రాపా.వీరసింహం మరియు ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.



## భక్తులచే భక్తిశ్రద్ధలతో ఏకాహం రుద్రాభిషేకం

**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని 75 తాళ్లూరు అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో మంగళవారం మాస శివరాత్రి పురస్కరించుకొని, భక్తులచే భక్తిశ్రద్ధలతో మహన్యాస రుద్రాభిషేకాలు ఏకాహం రుద్రాభిషేకం శివలింగానికి అయోధ్య స్వామి ఉత్సవ విగ్రహానికి భక్తులచే పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఆదిత్య శర్మ పాల్గొని మాట్లాడుతూ లోక కళ్యాణ కోసమే ఏకాహం రుద్రాభిషేకంలు నిర్వహించుకోవడం పూర్వజన్మ సుకృతని ఆయన అన్నారు ఏ గ్రామంలైతే మాస శివరాత్రి పురస్కరించుకొని మహన్యాస రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారో. ఆ గ్రామంలో ఆ కుటుంబంలో పాడి పరిశ్రమ అష్టసిద్ధులు చెందుతాయని శర్మ అనంతరం భక్తులకు తీర్థప్రసాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## శుభదిన భోజనము ఏర్పాటుచేసిన గోవిందరాజులు

**బొల్లాపల్లి మేజర్ న్యూస్:** మండలంలోని పేర్ల పాడు గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాసరగడ్డ గోవింద రాజులు, శుభదిన భోజనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గోవింద రాజులతో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ శుభదిన భోజన కార్యక్రమాన్ని తమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ఇటువంటి కార్యక్రమాలు చేసేందుకు తమ సభ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. సెలవులు సందర్భంగా మా పాఠశాలలో పిల్లలకు, నూతన ఎస్ఎంసి కమిటీ సభ్యులు కి 200 మందికి భోజనాలు, పెట్టటం జరిగినదని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రధానోపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి గంగినేని రమణయ్య, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు. రాచపల్లి. ఏడుకొండలు, మాజీ తెలుగుయువత అధ్యక్షులు బొప్పూడి. శ్రీనివాస్,కట్ల. వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు శీలం ఐతన్న, స్కూల్ చైర్మన్. నాగయ్య, పిట్టల బాలు గోవింద్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు



# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాల అమలు చేయాలి : ఏఐటియుసి




**వినుకొండ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో వివిధ కేటగిరీలలో పనిచేయుచున్న ఇంజనీరింగ్ వర్కర్స్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులు వాటర్ వర్క్స్, కరెంటు, డ్రైవర్స్, బోర్ వర్కర్స్, పారిశుద్ధ్య కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించి ఆమోదించిన కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ మాజీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. మారుతీ వరప్రసాద్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికుల మస్టర్ సమయములో కేంద్ర ప్రభుత్వం కార్మిక శాఖ ఆమోదించి వెలువరించిన మున్సిపల్ కార్మికుల కనీస వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే అమలు జరపాలని జరిగిన ధర్నాలో మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో వివిధ కేటగిరీలలో పనిచేయు చున్న ఇంజనీరింగ్ పారిశుద్ధ్య కార్మికులు అనేక దశాబ్దాలుగా కనీస వేతనాలు అమలు చేయాలని అనేక పోరాటాలు చేయడం జరిగిందని రాష్ట్రంలోని పాలకులు వివిధ కారణాలు చెప్పుచు కార్మికులకు కనీస వేతనాలు అమలుపరచుటలో తీవ్ర జాప్యం చేస్తున్నారని వారు విమర్శించారు. ఇటీవల కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆమోదించి వెలువరించిన హైస్కిల్డ్ కార్మికులకు 26,910 రూపాయలు, నైపుణ్యం కలిగిన కార్మికులు క్లరికల్ సిబ్బందికి నెలకు 24800 రూపాయలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు నెలకు 22600 రూపాయలు వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు స్కిల్డ్ సెమి స్కిల్డ్ వేతనాలను పారిశుద్ధ్య కార్మికుల కనీస వేతనాలను క్రమ పద్ధతిలో సవరించి వెంటనే అమలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సంపెంగుల అబ్రహం రాజు, పచ్చి గొర్ల యేసు, ట్రాక్టర్ డ్రైవర్స్ కంచర్ల కోటేశ్వరరావు, రమణారెడ్డి, లింగాల వెంకటేశ్వర్లు, తిప్పిశెట్టి కోటేశ్వరరావు, వల్లెపు కోటేశ్వరావు, వల్లెపు శ్రీను,బూదాల లక్ష్మయ్య, షేక్ నాగూరు, పి స్వామి, పాలడుగు లక్ష్మణరావు, రమేష్, తాని చింతల దాసు, పందుల అశోక్, షేక్ రఫీ, జ్యోతి, సిహెచ్ వెంకటేశ్వర్లు, అచ్చుకట్ల మార్తమ్మ, బూదాల నాగరాణి, ఖమ్మం పాటి మార్తమ్మ, బక్కా కొండమ్మ, రమావత్ గురవమ్మ, వేల్పుల కోటేశ్వరమ్మ, పి.శారమ్మ తదితరులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తు దసరా సంబరాలు



**మాచర్ల ప్రతినిధి మేజర్ న్యూస్ :** మాచర్ల పట్టణంలోని స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు ఘనంగా ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. నవరాత్రులను పురస్కరించుకుని స్కూల్ ఆవరణలో విద్యార్థులతో రోజు వారి అలంకరణలో భాగంగా చిన్నారులతో అమ్మవార్ల వేషధారణ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు,యాజమాన్యం వారు రామకృష్ణ,శ్రీధర్ గుప్తా, హరీష్ చంద్ర, డాక్టర్ సదాశివరాజు, వీరు మాట్లాడుతూ చెడు మీద మంచిని సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునేది విజయదశమి పండుగ.సమస్త ప్రాణులయందు బుద్ధి, ప్రేమ, శాంతి, క్షమ, శక్తి మెదలగు రుపాలలో వసించి నడిపిస్తున్న విశ్వమాత అని విద్యార్థులకు పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి అలంకరణలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, ఇన్చార్జిలు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు మరియు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం



**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం మండలంలోని పిల్లుట్ల మరియు సింగరాయపాలెం తండా గ్రామాలలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సహాయ వ్యవసాయ సంచాలకులు బి శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రత్తి పంటలో మెగ్నీషియం లోపం కనబడటం వలన మెగ్నీషియం సల్ఫేట్ ను 10 కేజీలు ఎకరానికి చొప్పున చల్లుకోవాలని, మిరప పంటలో పశువుల ఎరువు ,వేప పిండితో కలిపి ట్రైకోడెర్మా విరిడీ వాడుకోవాలని తెలిపారు. వరి పంటలో ఆకు చుట్టు పురుగు నివారణకు కార్టజిన హైడ్రో క్లోరైడ్ ( కార్టాఫ్) 400 గ్రా /ఎకరానికి పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని కె. రమమ్మ, వ్యవసాయ సహాయకులు కే నరసింహా నాయక్ షేక్ దుర్గి యాకుబ్ గ్రామ నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## సంక్షోభంలోనూ సంక్షేమం ఆగనివ్వని ప్రజాసారథి చంద్రబాబు

### రేమిడిచర్లలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జీవీ, మక్కెన



**వినుకొండ, మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమం ఆగనివ్వని నిజమైన ప్రజా సారథి ముఖ్యమంత్రి చంద్రబాబు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు.రూ.14లక్షల కోట్ల అప్పులు వారసత్వంగా వచ్చినా ఇచ్చిన మాట కోసం నిలబడిన సీఎం చంద్రబాబు ఒకే ఒక్క సంతకంతో ఒక్కరోజులో రూ.3 వేల పింఛన్‌ను రూ.4 వేలు చేశారన్నారు. విభిన్న ప్రతిభావంతులకు రూ.3 వేల పింఛన్‌ను రూ.6 వేలు చేశారని, దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారితో శాశ్వత అంగవైకల్యం ఉన్నవారికి రూ.15 వేల పింఛన్ ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకుంటున్నారని తెలిపారు. మంగళవారం బొల్లాపల్లి మండలం రేమిడిచర్లలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మరియు మాజీ శాసన సభ్యుల మద్దు మల్లికార్జునరావు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ లక్షల కోట్ల అప్పులు చేసి జగన్ పింఛన్‌పై సంవత్సరానికి రూ.250 పెంచితే, ఒకేసారి రూ.వెయ్యి పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. వైసీపీ హయాంలో ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచలేదని, ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచలేక పోయారని, రాష్ట్రాన్ని ముంచేశారని మండిపడ్డారు. అవినీతితో రాష్ట్రాన్ని దోచుకున్నారని, ఇసుక, మద్యం, గ్రానైట్ సహ అన్నింట్లో దోపిడీ చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా పాసుపుస్తకాలపై వేలకు వేలు వసూలు చేయించి కోట్లు దండుకున్నారని, దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ ఇవ్వబోతున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కోసం 1500 బస్సులు కొనుగోలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2 నుంచి కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నా రని, విభిన్న ప్రతిభావంతులు ఉంటే సదరం సర్టిఫికెట్లు కూడా తెచ్చుకోవాలని సూచించారు. త్వరలోనే గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సుల్లో నిర్వహించి ఎక్కడైతే పేదలకు అన్యాయం జరిగిందో వారి ద్వారా అర్జీలు స్వీకరించి ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే ఇంటింటికీ మంచినీటి పథకంతో పాటు వరికపూడిశెల ప్రాజెక్టు, పేదలకు ఇళ్లు, ఎన్టీఆర్ కాలనీలు, అర్హులందరికీ పింఛన్లు ఇచ్చి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మండల ఎంపిడిఓ షేక్ గౌస్య బేగం , ఎమ్మార్వో సుధాకర్ , జనసేన నాయకులు నిస్సంకర శ్రీనివాసరావు, గోవిందు నాయక్ ,పెమ్మసాని నాగేశ్వరరావు,పెసల వెంకటనారాయణ బొరెడ్డి వెంకటేశ్వర రెడ్డి,అరికట్ల వాసుదేవ రెడ్డి గారు,కోట నాయక్,తిప్పి శెట్టి వెంకటేశ్వర్లు,దాసరి కోటేశ్వరరావు,రావూరి నారాయణ, వెంకట కోటయ్య,ముక్కపాటి వెంకటేశ్వర్లు , టిడిపి ,జనసేనా ,బిజెపి నాయకులు గ్రామస్తులు ,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పెన్షన్లు పంపిణీ చేసిన వాగ్యా నాయక్



**బొల్లాపల్లి, మేజర్ న్యూస్:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్ర మంలో భాగంగా మంగళ వారం వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని తండాలో లబ్ధిదారులకు 6000 పెన్షన్ అందజేసిన మూడావత్ వాగ్యా నాయక్ మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు అందించడంలో తెలుగుదేశం పార్టీ అధినేత సీఎం చంద్రబాబు నాయుడు కి సాధ్యమని పింఛను పెద్ద మొత్తంలో పెంచి లబ్ధిదారులకు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన సారధ్యంలో ముందుకు నడుస్తూ ఆయన ఆశయాలను అనుగుణంగా మార్చుకొని బొల్లాపల్లి మండలంలో టిడిపి బలోపేతానికి కృషి చేయడంతో పాటు రానున్న అన్ని ఎన్నికలలో టిడిపి జెండా ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

# జగన్‌రెడ్డి పాలనలో రైతుల ఆత్మహత్యలు : ఎమ్మెల్యే జీవీ

### పేర్లపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన





**వినుకొండ మేజర్ న్యూస్:** గడిచిన అయిదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో రైతులకు ఆత్మహత్యలు తప్ప ఒరిగిందేంటని సూటిగా ప్రశ్నించారు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. జగన్ ప్రభుత్వంలో ఏడాదికి 1100 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, మరికొందరు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన ,ఆ పరిస్థితి మార్చాలనే ప్రజాప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నా రు. బొల్లాపల్లి మండలం పేర్లపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. గ్రామ సమీపంలో సాగు చేస్తున్న మిరప పంటను పరిశీలించారు. డ్రోన్ ద్వారా మిరప పంటకు మందుల పిచికారీ చేశారు. ఎమ్మెల్యే జీవీ స్వయంగా డ్రోన్‌ను ఆపరేట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే జీవీ చంద్రబాబు వస్తే వర్షాలు పడవు, జలాశయాలు ఎండిపోతాయని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ సహా జలాశయాలన్నీ జలకళతో ఉట్టిపడుతున్నా యన్నారు.. దీనికేం సమాధానం చెబుతారని నిలదీశారు. పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పిస్తామని, రైతులంతా సంతోషంగా ఉంటారన్నారు. చంద్రబాబు మళ్లీ తిరిగి వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు, యాంత్రీకరణ యంత్రాలు సహా అన్నింటిపై రాయితీలు ఇస్తున్నారన్నారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో సాగు చేసేందుకు 90% రాయితీపై పరికరాలు అందజేస్తారన్నారు. బొల్లాపల్లి మండలం సహా వినుకొండ నియోజకవర్గం ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉంటుందని, భవిష్యత్తులో మంచి ఆదాయం రావాలంటే ఉద్యాన పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు చేయడానికి వ్యవసాయశాఖ సిబ్బంది మొత్తం సంసిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనలో రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, నీళ్ల ఇంజిన్లు, మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు ఇవ్వలేదని, నామమాత్రంగా గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు ఇచ్చుకున్నారన్నారు. గత తెదేపా ప్రభుత్వంలో వినుకొండ నియోజకవర్గం లోనే రూ.10 కోట్ల విలువైన ట్రాక్టర్లు, నీళ్ల ఇంజిన్లు, తైవాన్ స్ప్రేయర్లు ఇచ్చామన్నారు. 2014-19లో బొల్లాపల్లిలో 50 ట్రాక్టర్లు ఇస్తే జగన్‌రెడ్డి పాలనలో కేవలం 13 ట్రాక్టర్లే ఇచ్చారన్నారు. గొర్రులు, రోటావేటర్లు, పవర్ టిల్లర్లు, కలుపు తీసే పవర్‌వీడర్ల లాంటి పరికరాలు 1500 వాటికి రాయితీపై ఇచ్చామని, జగన్ పాలనలో కేవలం 22 మందికి ఇచ్చారన్నారు. చంద్రబాబు పాలనలో తైవాన్ స్ప్రేయర్లు వెయ్యి ఇస్తే జగన్‌రెడ్డి ఐదేళ్లలో 100 మంది వైసీపీ కార్యకర్తలకు ఇచ్చుకున్నారన్నారు. ఆయిల్ ఇంజిన్లు 220 ఇస్తే జగన్‌రెడ్డి పాలనలో గుండుసున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. 2014-19లో ఉద్యానవన శాఖ ద్వారా మొక్కలు ఇచ్చామని, ఉద్యాన పంటలను ప్రోత్సహించారని తెలిపారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు ఇస్తామని, ఎక్కడైనా అందకపోయినా, బ్లాక్ మార్కెట్ జరిగినా వెంటనే అధికారులతో పాటు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బ్లాక్ మార్కెట్‌లో అమ్మేవారి లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశించారు. ప్రతి రైతు సంతోషంగా ఉండేలా గిట్టుబాటు ధర కూడా కల్పిస్తామన్నారు. జనసేన ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త నిశంకర్ శ్రీనివాసరావు, వివిధ శాఖల ప్రభుత్వాధికారులు ,టిడిపి నాయకులు జరపాల గోవింద నాయక్,పెమ్మసాని నాగేశ్వరరావు, టీప్పిశెట్టి వెంకటేశ్వర్లు,దాసరి కోటేశ్వర రావు, పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## తోటి కార్మికుడుకి ఆర్థిక సాయం



**మాచర్ల, మేజర్ న్యూస్ :** విధి నిర్వహణలో గాయపడిన కార్మికుడు బత్తుల కోటేశ్వర రావుకు పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గాజుల చెన్నయ్య మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ పని సమయంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రతి కార్మికుడు యూనియన్ సభ్యత్వాన్ని పొంది ఉండాలని, యూనియన్ లో సభ్యత్వం ఉన్నవారికే ప్రభుత్వ పథకాలతో పాటు యూనియన్ అందించే ప్రత్యేక రాయితీలు వర్తిస్తాయన్నారు. ఈ క్రమంలోనే గాయపడిన కార్మికుడు కోటేశ్వరరావుకు ఆర్థిక సాయం అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిన శ్రీను, షేక్ మౌలాలి, బత్తుల వెంకటస్వామి, బత్తిన వెంకటేశ్వర్లు, షేక్ జబ్బార్, తిమ్మరాజు, ఉప్పుతోళ్ళ అంజి, ఉప్పాల మట్టయ్య, బత్తుల మల్లికార్జునరావు, రమణయ్య, నాగ బొజ్జ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేసిన ఎండిఓ శ్రీనివాస రావు



**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం మండలంలోని అన్ని గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మాచవరం మేజర్ గ్రామపంచాయతీలో ఆయనే స్వయంగా పెన్షన్ పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమాలు పర్యవేక్షణ చేశారు. మాచవరంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్లా, ఎడ్లపల్లి సాంబయ్య, అన్ని గ్రామాల్లో గ్రామ సర్పంచులు టిడిపి నాయకులు , జనసేన నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన నిర్మల స్కూల్ విద్యార్థి



**వినుకొండ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో అండర్ 17 విభాగంలో నిర్మల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి బి. హర్షగోల్డ్ మెడల్ సాధించాడని సిస్టర్ సెలీన్ తెలిపారు. సెప్టెంబర్ 30న పెనుమాకలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 17 విభాగంలో 100 మీటర్లు మరియు 200 మీటర్లు పరుగు పందెంలో బి హర్ష గోల్డ్ మెడల్ సాధించాడని ఈ నెలలో శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటాడని తెలియజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినం దన సభలో విద్యార్థి బి హర్ష ను పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సిసిలి, ప్రిన్సిపల్ సిస్టర్ రాణి గోవిందు, సిస్టర్ బెనడిక్టా, సిస్టర్ ఎల్సి చాకో, అథెటిక్స్ కోచ్ డి అశోక్, వ్యాయామ ఉపాధ్యా యుడు పవన్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొని అభినందించారు.

## అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** అభివృద్ధి సంక్షేమ లక్ష్యంగా ఓటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని పెద్ద కోరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. పెద్దకూరపాడు మండల పరిధిలోని కంభంపాడు గ్రామంలో మంగళవారంఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా స్థానిక అధికారులు మరియు నాయకులతో కలిసి పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తుందని, రాష్ట్ర అభివృద్ధి ప్రధాన ధ్యేయమని అన్నారు. గత ప్రభుత్వంలో వాలంటీర్లతో పెన్షన్లను నాలుగైదు రోజుల వరకు పంపిణీ చేసే వాళ్ళని, ఇప్పుడు ప్రతి నెల మొదటి తారీకునే నూరు శాతం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అధికారులు నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## ఏఎం రెడ్డి విద్యాసంస్థల్లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు..

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** స్థానిక పెట్లూరి వారి పాలెం లో ఏ ఎమ్ రెడ్డి స్మారక విద్యాసంస్థల్లో మంగళవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన ఉపన్యాసం పాటల పోటీలను నిర్వహించారు. కళాశాల కార్యదర్శి అల్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశానికి మంచి గుర్తింపు తెచ్చిన వ్యక్తుల్లో గాంధీజీ ఒకరని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్ భార్గవ్ భూషణ్ రావు మాట్లాడుతూ ప్రస్తుత ఆటవిక సమాజాన్ని ఆధునిక సమాజంగా మార్చటానికి అహింస ఒక ఆయుధంగా ఉపయోగపడుతుందని ఆ ఆయుధాన్ని అందించిన మహాత్మా గాంధీ భారతదేశంలో జన్మించడం ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జునరావు, డిప్లమా కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, అకాడమిక్ డీన్ లక్ష్మీ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## గీతంమ్స్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు




**వినుకొండ, మేజర్ న్యూస్ :** స్థానిక నరసరావుపేట రోడ్డులోని గీతమ్స్ హై స్కూల్ నందు గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరై మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసినటువంటి శాంతి, అహింస, స్వాతంత్ర్య సాధనలో గాంధీ కృషి గురించి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు. అనంతరం మహాత్మా గాంధీ వేష ధారణలతో విద్యార్థులు అలరించారు. గాంధీ జ్ఞాపకార్థం వారు అమితంగా ఇష్ట పడిన రఘుపతి రాఘవ రాజారామ్ గీతాన్ని ఆలపించారు.అనంతరం కరస్పాండెంట్ కోటిరెడ్డి మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ స్వతంత్ర పోరాటంలో వారు చేసినటువంటి పోరాటం మరియు ఆంగ్లేయుల పాలననుండి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు. ప్రజలు అతన్ని మహాత్ముడని, జాతిపిత అని గౌరవిస్తారు. సత్యము, అహింసలు గాంధీ నమ్మే సిద్ధాంత మూలాలు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహము అతని ఆయుధాలు. కొల్లాయి కట్టి, చేత కర్రబట్టి, నూలు వడకి, మురికివాడలు శుభ్రం చేసి అన్ని మతాలూ, కులాలూ ఒకటే అని చాటాడు. అని వారి గూర్చి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కనిపించకుండా పోయిన వీఆర్ఓ

### తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** ముప్పాళ్ళ మండలం నార్నెపాడు విఆర్ఓ గా పనిచేస్తున్న సత్తెనపల్లి మల్లికార్జునరావు గత రెండు రోజులుగా కనిపించడం లేదంటూ తల్లి సత్తెనపల్లి నాగేంద్రమ్మ సోమవారం ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో ఆ పేరు కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. పలుదేవర్ల పాడు గ్రామానికి చెందిన సత్తెనపల్లి మల్లికార్జున రావు ఇదే మండలంలో నార్నెపాడు గ్రామ సచివాలయంలో గత ఐదు సంవత్సరాల నుండి విఆర్ఓగా పనిచేస్తున్నారు. అదే క్రమంలో గత నెల 30న ఉదయం ఉద్యోగానికి వెళ్లి సాయంత్రం వరకు రాలేదని, సచివాలయం దగ్గర ఉండి ఎవరికి చెప్పకుండా ఎటు వెళ్లాడో తెలియదని పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు ముప్పాళ్ల ఎస్ఐ ఉయ్యూ రు సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## పొలం పిలుస్తుందిలో పాల్గొన్న ఏఓ శ్రీనివాస రెడ్డి..



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** మండలములోని పెదఅగ్రహారం గ్రామములో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ముందుగా మండల వ్యవసాయ అధికారి, ఎన్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు కూడా పంట నమోదు చేయించుకోవాలని, పంట నమోదు వలన ఉపయోగాలు మరియు పంటలబీమా గురించి తెలియజేశారు. అలాగే వ్యవసాయశాఖ అందించే వివిధ రకాల పథకాలు మరియు సేవల గురించి, రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉంచుట మరియు పంటలలో వచ్చు చీడపీడల గురించి వాటి నివారణ చర్యల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కో-ఆర్డినేటర్, వాల్యూ ఆయిల్స్ కంపెనీ నవీన్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట గురించి వివరించారు. ఆయిల్ పామ్ సాగుపై ఉత్సాహం ఉన్న రైతులకు మొక్కల నుండి మార్కెటింగ్ వరకు అన్ని తామే చూసుకుంటాము అని తెలియజేశారు. డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్, నరసరావుపేట నుండి వచ్చిన ప్రవీణ్ , వ్యవసాయ అధికారి పొలం పిలుస్తుంది కార్యక్రమము గురించి వివరించారు. గ్రామసభ అనంతరం, క్షేత్ర సందర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెదఅగ్రహారం వి ఏ ఏ, బి.విజయ భాస్కర్, రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అర్చక సేవా సంఘం నుండి సీఎం రిలీఫ్ ఫండ్‌కి లక్ష అందజేత..



**గుంటూరు, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల ఏర్పడిన తుఫాను, వరదల కారణంగా సర్వం నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ చర్యల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కి అర్చక సేవా సంఘం పల్నాడు జిల్లా నుండి లక్ష రూపాయలు చెక్కును అర్చక సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర, అర్చక సేవా సంఘం పల్నాడు అధ్యక్షులు చిట్యాల మల్లికార్జున శర్మ, నాయకులు చెంగోలం శేషాచార్యులు, వడ్డమాను రమణా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన జడ్పీ సీఈవో



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** గుంటూరు జెడ్పీ సీఈవో వి జ్యోతి బసు మంగళవారం గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన సజ్జల వెంకటేశ్వరరావుకు సీఈవో తన చేతుల మీదుగా పింఛన్ అందించారు. గ్రామ పరిధిలో పారిశుధ్యం అమలును పరిశీలించారు. అనంతరం పంచాయతీ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాసరావు, మాజీ మండల అధ్యక్షులు టాటా లక్ష్మి కుమారి, గ్రామ కార్యదర్శి మీనాక్షి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ వి సురేష్, జనసేన నాయకులు కాటూరి శ్రీనివాసరావు మాస్టారు, త్రినాథ్, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగరంపాలెం సిఐగా వీరా నాయక్



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్ సిఐగా ఎల్ వీరా నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ కి చెందిన వీరా నాయక్ గతంలో గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సిఐగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల సమయంలో నెల్లూరు బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ సిఐగా వెళ్లారు. ప్రస్తుత బదిలీల్లో భాగంగా నగరంపాలెం సిఐగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సిఐ విలేకరులకు తెలిపారు.

## దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పాలనను అందిస్తున్న కూటమి ప్రభుత్వం

### జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి



**గుంటూరు (మేజర్ న్యూస్) :** గత వైసీపీ ప్రభుత్వం ఖజానాను పూర్తిగా ఖాళీ చేసినా ఎక్కడా వెనకడుగు వేయకుండా కూటమి ప్రభుత్వం గతంలో కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పాలనను అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డ్ సృష్టిస్తుందన్నారు. మంగళవారం 69, 70, 71, 72 సచివాలయాల పరిధిలో సిబ్బందితో కలిసి సామాజిక పింఛన్లను అయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ అవ్వా తాతలతో పాటూ ఒంటరి మహిళలకూ, వికలాంగులకూ బలమైన ఆర్ధిక భద్రతను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. వైసీపీ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని, బాబు, పవన్ ల పాలనలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని ఆళ్ళ హరి అన్నారు. టీడీపీ నాయకులు చింతకాయల సాయి, గంధం బాబ్జి, బీజేపీ మహిళ నాయకురాలు జూపూడి భవాని, వడ్డే సుబ్బారావు, సచివాలయం సిబ్బంది వరలక్ష్మి, ప్రభు పాల్గొన్నారు.

## 3 నుంచి దసరా మహోత్సవాలు

**గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్ :** స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 3 నుండి12 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య తెలిపారు. ప్రతిరోజు అమ్మవారికి విశేష అలంకరణలతో పాటు, పలు సాంస్కృతిక,ఆధ్యాత్మిక , కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు .9న విద్యార్థులచే సామూహిక సరస్వతీ పూజలు జరుగుతాయి అన్నారు. స్థానిక సంపత్ నగర్ శ్రీ శారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఈనెల 3 నుంచి 13 వరకు దసరా మహోత్సవాల నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి పోలిశెట్టి శ్రీహరి ప్రసాద్ రావు తెలిపారు. ప్రతిరోజు అమ్మగారికి విశేషాలంకరణలు, సుహాసినిలచే సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన సాయంత్రం సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి అన్నారు.9న విద్యార్థులచే సామూహిక సరస్వతి దేవి పూజలు 10న కన్యలచే కాత్యాయనీ వ్రతము 13 న రథోత్సవం జరుగుతుందని తెలిపారు.

# పెద్ద ఎత్తున బిజెపి సభ్యత్వం నమోదు కార్యక్రమం..



**గుంటూరు, మేజర్ న్యూస్:** అరండల్ పేట15వ లైను లోని ఎస్సీ మోర్చా కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ ధారా అంబేద్కర్ ఆధ్వర్యంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా సభ్యత్వ పరిశీలకులు పాలపాటి రవికుమార్ హాజరై మాట్లాడారు. దేశ ప్రజలందరూ కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వం మూడోసారి కోరుకుని అధికారం ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని బిజెపిలో పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేపట్టాలని కోరారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ధారా అంబేద్కర్ మాట్లాడుతూ అంత్యోదయ సిద్ధాంతం ఆధారంగా సమాజంలోని అట్టడుగు స్థాయికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్ని చేరువయ్యే విధంగా బిజెపి కార్యకర్తలు కృషి చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో సభ్యత నమోదు కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతామని అన్నారు. నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని 'సేవ పట్వాడా' కార్యక్రమంలో భాగంగా' పేదలకు కూరగాయలు, బిస్కెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చెరుకూరు తిరుపతిరావు, చరక కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు భగవాన్ దాస్, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్, జల్ది మోహన్, జిల్లా ఆర్టిఐ సెల్ కన్వీనర్, బూసి స్టాలిన్ బాబు, కొరివి నాగరాజు, మహిళా నాయకులు రమణ, దుర్గ, నాలుగో మండలం ప్రధాన కార్యదర్శి పెద్దింటి చైతన్య, తదితరులు పాల్గొన్నారు

## ఎన్నారైలో అహింసా దినోత్సవం



**మేడికొండూరు మేజర్ న్యూస్:** మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో గాంధీజీ 155వ జన్మదిన పురస్కరించుకొని 18 వ అంతర్జాతీయ అహింస దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ దేశ స్వతంత్రంలో గాంధీజీ పాటించిన అహింస విధానం ప్రపంచానికి మార్గదర్శకంగా మారిందని గాంధీజీ గారి జన్మదిన అక్టోబర్ 2న 2014 సంవత్సరంలో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి 10 సంవత్సరాలు అయిన సందర్భంగా సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు స్వచ్ఛత హి సేవ ద్వారా కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమీప గ్రామంలో స్వచ్ఛత సేవలు నిర్వహిస్తూ శుభ్రత పై అవగాహన కల్పిస్తూ సమాజానికి తమ వంతు సహకారాన్ని అందిస్తూ ఈ రెండు వారాలు ఎంతో శ్రమించి మంచి సేవలో పాల్గొన్నారు తెలియజేశారు అలాగే కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీహరి గారి మాట్లాడుతూ మన దేశ గౌరవాన్ని స్వాతంత్ర పోరాటపటి మనం ప్రపంచస్థాయికి స్ఫూర్తిగా నిలిచిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం మరియు పేస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు బుక్స్ ,పెన్సు క్యాప్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గారి చేతుల మీదుగా పారుపల్లి రమేష్ గారు ఫేస్ సెక్రటరీ ద్వారా బహుకరించారు కళాశాల విద్యార్థిని విద్యార్థులు అందరూ ఈ గాంధీ జయంతి లో భాగంగా గాంధీ గారి చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల ఏడి తిలక్ బాబు గారు స్వచ్ఛత హి సేవలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లను అభినందించారు ఈ కార్యక్రమం పట్ల కళాశాల సెక్రటరీ శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారు విద్యార్థుల సేవా నేర్పిని కొనియాడారు ఈ కార్యక్రమంలో చంద్రమౌళి గారు రవికుమార్ గారు నాగేశ్వరావు గారు రాము గారు వివిధ శాఖ అధికారులు వాదనాబాదనేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ మద్యందుకాణాల ఉద్యోగులకు,ప్రత్యాంన్యాయం చూపండి



**తెనాలి మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ భద్రత కల్పించాలని తెనాలి డిపో కమిటి అధ్యక్షులు పినపాటి కొండల రాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో ఐఎంఎల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. సెప్టెంబర్ 30 నాటికి ప్రభుత్వ మద్యం పాలసీ రద్దవుతున్న సందర్భంగా గత ఐదేళ్లగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సూపర్వైజర్లు అలాగే సేల్స్ మేన్స్ ఉద్యోగ భద్రతపై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా ఫలితం సూన్యమన్నారు. జిఓ నంబరు 357/2019 ద్వారా సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో తమను మద్యం దుకాణాలలో నియమించారన్నారు. కూటమి ప్రభుత్వ నూతన మద్యం పాలసి విధానం తమను అన్యాయం చేస్తుందన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్హతను బట్టి నియమాకాలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. కమిటి సభ్యులు పినపాటి వంశి మాట్లాడుతూ 2021 సంవత్సరంలో కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న సమయంలో కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్, డి సురేష్, భాస్కర్, గోపి, ప్రకాష్, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, నాగూర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు



**తెనాలి టౌన్ న్యూస్ :** తెనాలి 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి & చైర్మన్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ డి శ్రీనివాసులు ఆదేశానుసారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా చెంచుపేట లోని శబరి వృద్ధాలయం నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది జి. దీపక్ కుమార్ మాట్లాడుతూ తమ ఉన్నతికి కారకులైన తల్లిదండ్రుల పట్ల బిడ్డలు బాధ్యత వ్యవహరించాలని తెలిపారు. తల్లిదండ్రులు సైతం ప్రతిదానికి తీవ్ర నిర్ణయాలు తీసుకోకూడదు, ఓర్పు నేర్పుతో పెద్ద మనసుతో మసులుకోవాలని, రాజీ మార్గమే రాజమార్గంగా వ్యవహరించడం ఉభయకుశులోపరిగా ఉంటుందని తెలిపారు. దేశంలో పండుటాకులకు కొంత బిడ్డలు బంధువుల నుంచి వేధింపులు నిరాదరణ పెరిగిపో తుండడంతో కేంద్రం 2007లో తల్లిదండ్రులు వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు అయింది. దానికి ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్ అధికారి చైర్మన్గా స్వచ్ఛంద సంస్థల నుంచి ఒకరు లేదా ఇద్దరు సభ్యులుగా ఉంటారు.

## ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ గుంటూరు: కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు (కార్పొరేషన్) :** స్వచ్ఛ గుంటూరు సాధనలో నగరంలోని వివిధ వర్గాల ప్రజలు, యువత, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వాములు అవుతున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సమిష్టి కృషితో అతి త్వరలో స్వచ్ఛ గుంటూరు సాకారమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక టిజెపిఎస్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం నగరంలోని అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలకు ఐటిసి సంస్థ వ్యర్ధాల నిర్వహణపై అవగాహన శిబిరం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుండి గుంటూరు నగరంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో మెగా పారిశుధ్య డ్రైవ్, పార్క్ ల శుభ్రం, సైకిల్ ర్యాలీ, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు, యాంటీ మలేరియా యాక్టివిటి వంటి అనేక కార్యక్రమాలు చేపట్ట నున్నట్లు చెప్పారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి నినాదం కావాలని, తమ ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రం భాధ్యతగా తీసుకోవాలన్నారు. అంగన్వాడీ టీచర్లు తమ వద్దకు వచ్చే పిల్లలకు స్వచ్ఛతపై ప్రత్యేక అవగాహన కలిగిస్తే భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞ చేయించి మానవహారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓలు కృష్ణవేణి, శ్రీవాణి, చంద్రకళ, ఐటిసి బంగారు భవిష్యత్, ఫినిష్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ నారాయణ, టిజెపిఎస్ కళాశాల సెక్రెటరి బ్రహ్మం, పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేసిన ఎంపీడీవో



**ఫిరంగిపురం మేజర్ న్యూస్:** ఫిరంగిపురంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ రోడ్ లో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి బాలమ్మ పెన్షన్లు పంపిణీ చేశారు. ఎండీవో మాట్లాడుతూ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు ఒకే రోజులో సామాజిక ఫించన్ పంపిణీ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ ప్రారంభించారు. కూటమి పార్టీల నాయకులు సచివాలయ ఉద్యోగులతో కలిసి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు వారి ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశారు.